కథలు :

# బంగ్లా దేశ్

చంద్రశేఖర్

బంగ్లాదేశ్ మీదవేసిన ప్రత్యేక సంచికకుకాను శరణార్థిశిబిరాల గురించి పంపిన రిపోర్టును మెచ్చుకుంటూ పత్రిక ఆఫీసునుంచి ఆరోజే ఉత్తరం వచ్చింది. ఆ రిపోర్టు చదివి తాము చాలా చలించామని, పాకిస్థాన్ నాయకులు బంగ్లాదేశీయులను పెట్టిన బాధలు వ్యాసకర్త కళ్ళకు కట్టినట్లు వర్ణించారని అనేకమంది పాఠకులురాసిన ఉత్తరాలను నాకు పంపిస్తూ, వాటితోపాటు నాకు 'రెమ్యునరేషన్'గా రు. 500/- కు ఒక చెక్ పంపించారు మా ఎడిటర్. ఆ 'చెక్' కేష్ చేసుకురమ్మని మా 'బోయ్'వి పంపించి, పాఠకుల ఉత్తరాలు తిరగేయసాగేను. " .... .... ఆ వ్యాసం చదువుతూన్నంతసేపు శరణార్థులతో మాట్లాడుతున్నట్లే ఫీలయ్యాం మేం. ముఖ్యంగా 'రహ్మత్ఆలీ' తో వ్యాసకర్తచేసిన ఇంటర్వ్యూ చదువుతున్నంతసేపు మా చెల్లెలి కళ్ళవెంట కన్నీళ్ళుకారిపోతూనేవున్నాయి .... .... మేం వెంటనే లఖింపూర్ శరణార్థి శిబిరానికి 50 రూ.లు విరాళంగా పంపిఁచాం" .... ....ఉత్తరాలు చదువుతూవుంటే నేను లఖింపూర్ వెళ్లడం .... ....ఆ శిబిరాన్ని దర్శించడం గుర్తుకు రాసాగేయి.

*   *   *

బంగ్లాదేశ్ మీద ప్రత్యేకసంచిక వేస్తున్నామని, వెంటనే సరిహద్దుల్లోని శరణార్థి శిబిరాలని సందర్శించి రిపోర్టు పంపమని పత్రిక ఆఫీసునుంచి 'రిక్విజిషన్' వచ్చింది ఆరోజే. ఆ తర్వాతరోజే లఖింపూర్ శిబిరాన్ని అమెరికన్ సెనేటర్ల బృందం సందర్శించబోతున్నట్లు ఆ రోజుకే నేనూ 'లఖింపూర్' చేరుకోగలిగితే బాగుంటుందన్న 'సజెషన్'కూడా చేశారు. ఎంత కాదనుకున్నా, అమెరికన్ సెనేటర్లు వచ్చిన రోజంత పకడ్బందీగా రోజూ ఏర్పాట్లుండడం కష్టం. నేను పంపించే రిపోర్టుక్కూడా కొంత నిండుతనం వస్తుంది. ఆ వుద్దేశంతోనే రాత్రికి రాత్రి ప్రయాణమై కలకత్తా నుంచి లఖింపూర్ చేరుకున్నాను.

ట్రెయిన్ లఖింపూర్ చేరేసరికి తెల్లగా తెల్లారిపోయింది. నా లగేజి అంతా దగ్గర్లో ఉన్న ఓ లాడ్జింగ్‌లో పడేసి, కాలకృత్యాలు తీర్చుకొని ఎనిమిది గంటలకల్లా రెడీ అయిపోయాను. ఊరికీ, శరణార్థుల శిబిరానికీ కనీసం నాలుగుమైళ్ళైనా వుంటుందిట. మరింకేమీ సాధనం కనపడక ఓ గుర్రబ్బగ్గీ కట్టించుకొని బయలుదేరాను.

1165

శరణార్థిశిబిరం చేరేసరికి 9 గంటలైంది. అప్పటికింకా అక్కడికి అమెరికన్ బృందంరాలేదు. గేటుదగ్గర నన్నునేను పరిచయం చేసుకుని నా క్రెడిన్షియల్స్‌ని చూపించి, పర్మిషన్‌తీసుకుని లోపలికి పోయేసరికి శరణార్థులంతా పెద్దక్యూలో నిలబడి పాలుతీసుకుంటున్నారు. క్యూలో కనీసం 500 మందేనావుంటారు. చింపిరి తలలూ, చిరిగిన గుడ్డలూ, పీక్కుపోయిన కళ్ళూ. జీవంలేని మొహాలూ - వాళ్ళూ– శవాల్లా వున్నారంతాను. చిన్నాపెద్దా, ఆడామగా అన్లేకుండా అంతా క్యూలో నిర్జీవంగా నిలబడి వున్నారు. ప్రతివాళ్ళ చేతిలో ఓ చిన్నడబ్బా. ఆ డబ్బాలెంత అసహ్యంగా వున్నాయో. క్యూ మొదట్లోకి చూశాను ఓ 'వలంటీరు' ఓ డబ్బాలోముంచి ఓపెద్ద పాత్రిలోంచి పాలుతీసి పోస్తున్నాడు వరసగా అందరికీ. అతనంత నిర్వికారంగా ఉండగలగడం చూస్తే ఆశ్చర్యమేసింది నాకు. ఇంతలో ఎవరో— రెండోచేతితో ఇంకోడబ్బా ముందుకునెట్టారు. పాలుపోసేవాడు అలవాటు ప్రకారం. కాని పాలుపోయడం అయిపోయాక తలపైకెత్తిచూసి వ్యవహారం కనిపెట్టేశాడు. ముందుకుపోతున్నవాణ్ణి పట్టుకు వెనక్కిలాగి బండబూతులు తిట్టాడు. అతని బెంగాలీయాసచూస్తే గొప్ప సరదావేసింది నాకు. ఆ పాలుతీసి మరొకడి డబ్బాలోవేసి పంపించేశాడు వలంటీరు.

'క్యూ'కేసే చూస్తున్నాను. ఓ ముసలమ్మ, డెబ్భై ఏళ్ళుంటాయనుకుంటాను. తనవంతు పాలుపోశాకకూడా కదలడంలేదు. మరికొంచెంపోయవా అన్నట్లుచూస్తోంది వలంటీరు తలపైకెత్తాడు, ఆ ముసలమ్మ ఏమీలేదన్నట్టు ముందు కెళ్ళిపోయింది. ఆ క్షణంలో- ఆ ముసల్దాని కళ్ళల్లో కనిపించిన భయంచూస్తే, గుండెల్ని పిండేసినట్లయింది నాకు. అలా ఆలోచిస్తూ ఉండిపోయాను.

ఇంతలో బయట కార్లాగిన శబ్దం వినిపించింది. అమెరికన్లు వచ్చారు. త్వరత్వరగా బైటికివెళ్లాను. వాళ్ళందర్నీ పత్రికా విలేఖరులకు పరిచయంచేశాడు వాళ్లతో వచ్చిన పబ్లిక్‌రిలేషన్స్ శాఖమనిషి. నేనుకాక మరిద్దరు మాత్రమేవున్నారు పత్రికలవాళ్ళు. ఆ బృందంలో అరుగురు సభ్యులున్నారు. అందరూ సెనేటర్లే. ఆ బృందం నాయకుడు క్రిస్టఫర్. అరవైఏళ్ళుంటా యనుకుంటాను. అతను మాట్లాడే పద్ధతిచూస్తే ముచ్చటేసింది నాకు. గబగబా మాట్లాడేస్తాడు. అవతలవాళ్ళనిట్టే నవ్వించగలడు. ఆ పది పదిహేను నిముషాల్లోనే అందరి దృష్టినీ ఆకర్షించగలిగాడు క్రిస్టఫర్.

"అన్నట్లు మనం టైంవేస్ట్ చేయకూడదు. పదండి శిబిరంలోకి పోదాం" అన్నాడు క్రిస్టఫర్— టీలు సేవించడం అయిపోగానే.

1166

అందరం శరణార్థులకేసి నడిచాం. ఇంకా చాలామంది ఆ'పాల'కోసం క్యూలో నుంచునివున్నారు. మేం ఆ క్యూదగ్గరకు వెళ్లాం. ఆ అమెరికన్లని చూసి బెదరిపోయి నట్టున్నారు వాళ్ళంతాను. చేతులెత్తి దణ్ణాలు పెడుతున్నారు. నిజంగా 'క్రిస్టఫర్' ను చూస్తే ఎవరికేనా అలాగే అన్పిస్తుందనుకుంటాను. చెయ్యెత్తు మనిషి. తెల్లగా గంభీరంగా వుంటాడు. పెద్దనుదురు. పెద్దపెద్దకళ్ళు. ఎప్పుడూ పెదాలమీద నాట్యంచేసే చిరునవ్వు. చూడగానే ఎంతోమంచివాడని అన్పిస్తుంది ఆయన్నుచూస్తే.

'ట్రాన్స్‌లేటర్'ను ఒకణ్ణి పక్కనపెట్టుకొని ఆయన శరణార్థులతో మాట్లాడ్డం మొదలుపెట్టాడు. నిజంగా శరణార్థులపట్ల, వారి కష్టాలను తెలుసుకోవడంపట్ల ఆయన చూపించిన శ్రద్ధచూస్తే నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఇదివరలో నేను యిలాంటి 'డెలిగేషన్లు' కేవలం 'షోమాన్‌షిప్'కే అంకితమైనవనుకుంటుండేవాణ్ణి. ఆయన అలా కాక హృదయపూర్వకంగా శరణార్థుల బాధలకు స్పందించడం చూస్తే నాకు వళ్ళు జలదరించింది. మన దేశీయులను ఆయనతో పోల్చిచూస్తే అసహ్యం వేసిందికూడాను. నిజానికి "ఓ ఎనభైఏళ్ళ ముసిలాడు పాకిస్థాన్ సైనికులు తననెలా హింసించిందీ, తన యింటికి వాళ్లు అర్థరాత్రి నిప్పుపెడితే ఆ మంటల్లో తన ఇద్దరు కొడుకులూ, కోడళ్లూ, తన చిన్నకూతురూ కాలి బూడిదవడం"— అంతా వర్ణిస్తుంటే ఆయనకళ్ల చెమర్చాయి. మరికొంతసేపు ఆయన శరణార్థులతో మాట్లాడేక శిబిరం నిర్వహిస్తున్న అధికారితో మాట్లాడేరు.

'శిబిరంలో వెయ్యిమందికి పైగావున్నారని ఎంత ప్రయత్నించినా సప్లైలు బాగా సరిపోవడంలేదనీ, స్థానిక ప్రజలుకూడా ఎంతో సహకరిస్తున్నారని, అంతర్జాతీయ సహకారంలేనిదే భారత ప్రభుత్వానికి యీ శరణార్థి శిబిరాల నిర్వహణభారం భరించ రానిదవుతుందనీ' చెప్పారు శిబిరం అధికారి.

క్రిస్టఫర్ కొంచెం బాధపడ్డట్టు కనిపించారు. ఆయన బృందం సభ్యులు మాట్లాడబోతుంటే వారినివారిస్తూ అమెరికాలో నూటికి తొంభైమంది బంగ్లా శరణార్థుల పట్ల జాలితోవున్నారని, పాకిస్థాను ప్రభుత్వంతో ఉన్న సౌహార్ద సంబంధాల దృష్ట్యా అమెరికన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా ఏమీచేయలేకపోతూన్నదని, దీన్ని అపార్థంచేసుకోడం తగదనీ, నిజానికి రాబోయే రెండునెలల్లో శరణార్థుల పోషణకు అమెరికా నుంచి ఎవరూ ఊహించనంత సహాయం అందుతుందనీ తెలియచెప్పారు.

ఆయన తన్ను అపార్థం చేసుకున్నారని శిబిరం అధికారి గుర్తించి, తన ఉద్దేశం అంతర్జాతీయ సహకారంలేదని కాదని, కాని రోజురోజుకూ శరణార్థుల సమస్య

1167

పెరుగుతున్నదృష్ట్యా సహాయంకూడా పెరగాలన్నకోరిక తాను బయటపెట్టానని చాలా ఎపాలజెటిక్‌గా చెప్పారు.

క్రిష్టఫర్ బృందం వారప్పటికప్పుడు ఆ శిబిరానికి 1000 డాలర్ల సహాయం ప్రకటించారు. తమవెంట తెచ్చిన బట్టలు, పాలపొడులు వగైరాలనుకూడా శిబిరానికి వారు యిచ్చివేశారు వెంటనే తాము వేరేశిబిరాన్ని సందర్శించాల్సిన అవసరం ఉందని చెప్పి వారుచాలా 'క్విక్'గా సర్దుకుని తమకారుల్లో వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోయాక నేను శిబిరం నిర్వహిస్తున్న అధికారులుండేవైపు వెళ్లాను. వాళ్ళంతా 'లంచి'కి వెళ్లారులావుంది ఒకరుమాత్రం అక్కడేవున్నారు. ఆయన గొప్ప తమాషామనిషి. మనం అడిగిన విషయం తప్ప మరెన్నైనా చెప్తాడు. ప్రశ్న వేసిన పాపానికి ఆయన చెప్పేదంతా వినాల్సివచ్చింది నాకు.

"ఏమండీ, శిబిరం నిర్వహణ గురించి ఏమైనాచెప్తారా?" అని అడిగాను నేను.

"ప్చ్ ఏంచెప్తాం లెద్దురూ"— అంటూ మొదలెట్టాడాయన. "అసలు ప్రపంచ చరిత్రలోనే నూతనాధ్యాయాన్ని సృష్టించిన మహత్తర చారిత్రిక ఘటన బంగ్లాదేశ్ పోరాటమని నిర్వివాదంగా చెప్పడానికి నేను సందేహించను. ఒకానొక ఇన్స్యూరెన్సు ఏజెంటు యింత ప్రాధాన్యంగల పోరాటాన్ని ముందువరసలో వుండి మొదలుపెట్టాడంటే ప్రపంచంలోని యావత్తు సామాన్యప్రజానీకం (యిన్స్యూరెన్సు ఏజెంట్లు అంటాడేమోనని నేను భయపడ్డమాట వాస్తవం సుమండీ!) తలెత్తుకు తిరగదగ్గ గర్వ కారణమైన విషయమంటే నమ్మండి .... ...."

ఆ బెంగాలీ భాషను ఖూనీచేస్తూ అదోతరహా యాసలో అతను మాట్లాడుతుంటే నాకు అదోతమాషాగావున్నా టైం వృధాఅయిపోతోందే అని చిరాకుకూడా కలిగింది.

"చూడండీ, శిబిరంలోకి శరణార్థులనెలా తీసుకొనేదీ, వాళ్ళ ఆహారపానీయాది సౌకర్యాలనెలా రెగ్యులేట్‌చేసేదీ చెప్తే బాగుంటుందేమో" అన్నాను కొంచెం చిరాకు ధ్వనిస్తూ.

"ప్చ్, ఏమిటిలెద్దురూ, అసలు మనవాళ్లు వెధవలండీ, ప్రపంచ చరిత్రలో గత మూడువేల సంవత్సరాల కాలంలోను పొరుగుదేశంలో యుద్ధం జరుగుతుంటే యీపద్ధతిని సరిహద్దులు తెరచుక్కూచున్న పకీర్ దేశం మరొకటిలేదనడం అతిశయోక్తి కాదనుకుంటాను. వస్తున్నవాడు శరణార్థో, గూఢచారో, గూండా [illegible]కొడుకో

అన్నవిచక్షణ, వివేచన, వివేకజ్ఞానం (యిదతవిమాటే సుమండీ) లేకుండా ఎవడో ఒకడువచ్చాడు అంతే చాలన్నట్లు సరిహద్దుల్లో కనపడ్డ ప్రతీవాణ్ణి పట్టుకొచ్చి శరణార్థి శిబిరాల్లోకిచేర్చారు. ఇంత అవివేకానికి యాభైకోట్ల భారతీయులని, ముఖ్యంగా నాలుగు కోట్ల బెంగాలీలని బలిపెడ్తున్న యీ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదనడం నిస్సందేహమైన విషయం. మాశిబిరం సంగతిమటుకు నేమచెప్తాను. ఇక్కడవున్న పధ్నాలుగు వందలమంది శరణార్థులలో పన్నెండుమంది దొంగవెధవలుగా మూడురోజుల పరిశీలన అనంతరం నగ్నంగా బయటపడ్డారు ......."

తల బొప్పికట్టిపోయింది నాకాపాటికే. "ఇప్పుడు చేసేదేముంది చెప్పండీ, గతజలసేతుబంధనం అన్నారు మనవాళ్లు. ఇంటర్నల్ సెక్యూరిటీయాక్ట్— యిందుకోసమే మన ప్రభుత్వం ప్రవేశపెట్టింది కూడాను. పరిహద్దుల్లో కూడా స్క్రీనింగ్ చేశాకే శరణార్థుల్ని రానిస్తున్నారని విన్నాను. మొదటిరోజుల్లో పొరబాట్లు ఎవరికైనా సహజం కదా" అన్నాను. నాకే ఆశ్చర్యమేసింది నాగొంతు ధ్వనిస్తున్నతీరు. పోట్లాడుతున్నట్లుంది అతన్తోటి.

"అవుననుకోండి ..." అంటూ నసిగాడతను "నేననేదల్లా .... అనవసరంగా ఎంతమంది వెధవల్ని మేపుతున్నామోనని"

చాలా బాధేసింది నాకు. ఓపక్క దేశదేశాలవాళ్ళు మనదేశం త్యాగనిరతిని నిండు హృదయాలతో కీర్తిస్తుంటే మనదేశస్థుల్లో కొందరి ఆలోచనలిలా తగలడ్డాయి. 'అల్పబుద్ధివాని కధికారమిచ్చిన'.... అంటే యిదేకామోసు. దొడ్డజన్మకానిది దొడ్డగుణమెలా వస్తుంది?

ఇక ఆయన్తో మాట్లాడ్డం అనవసరం అనిపించి శరణార్థుల్నెవర్నేనా ఇంటర్వ్యూ చేస్తాననిచెప్పి ఆయనదగ్గర శలవుతీసుకుని బయటపడ్డాను.

అప్పటికి 12 గంటలైంది. శిబిరం చుట్టుపక్కల ప్రదేశం, శిబిరం నిర్మాణం చూద్దామనిపించింది. అంత ఎండలో బయటతిరిగేకన్నా యింటర్వ్యూలు పూర్తిచేసుకుని సాయంత్రం. అపని పూర్తిచేద్దామనుకున్నాను. నాకు సాయంత్రం 6 గం॥లకు మళ్ళీ ట్రెయినుంది. ఆటైమ్‌కు అందుకోవచ్చుకూడాను.

శరణార్థులుండేవేపుకు నడిచాను అందులోకూడా కుటుంబాలున్నాయి కామోసు. నలుగురు ముగ్గురు చొప్పున అంతా గ్రూపులుగా విడిపోయి కూర్చునివున్నారు. వాళ్ళంతా ఏదో మాట్లాడుతూనేవున్నా అందులో ఏమాత్రం జీవం కనిపించలేదు నాకు.

1169

అలా వాళ్ళకేసిచూస్తుంటే వాళ్ళందరికి దూరంగా ఒక్కడేకూర్చుని కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంటూ కనిపించాడొకడు. ఏభై, అరవై ఏళ్లుంటాయనుకుంటాను. ఎఱ్ఱటి కళ్ళు నల్లటివళ్లు, తెగిపోయి గడ్డిదుబ్బులావున్నజుట్టూ- భయంకరంగా వున్నాడు. వంటిమీద ఒకచేగుడ్డ, గోచీపెట్టుకున్నాడు. ముందుగా అతనితో మాట్లాడదామనిపించి అతని దగ్గరగా వెళ్లాను.

"నీ పేరేమిటి బాబూ" అన్నాను నెమ్మదిగా

ఆదోలా చూశాడతను.

మళ్ళీ అడిగాను "నీ పేరేమిటి ?" అని.

"నాపేరా ? నాపేరు రహ్మత్ఆలీబాబూ" అన్నాడు. అంటూ నీకుదేనికి అన్నట్లు చూశాడతను నావేపు.

"నేను-మీగురించి పత్రికల్లోరాస్తాను. నీ ఫోటోకూడా వేస్తాను"అని చెప్పానునేను.

అర్థమైనట్లు తలూపాడతను.

"నీ విక్కడి కెలావచ్చావో. నీయిల్లూ వాకిళ్ల ఎందుకు వదలివేసివచ్చావో కొంచెం చెప్తావా ?"

"ఇంకేటి యిల్లుబాబూ.... నా యింటికి నిప్పెట్టేసినారు బాబూ.... బాబోయ్ నాయిల్లో" అంటూ ఏడుపు లంకించుకున్నాడు.

"చూడుబాబూ, యిల్లు తగలెట్టేరు అన్నావుకదా, ఎవరు తగలెట్టారు, ఎందుకు తగలెట్టారో కాస్తచెప్తావా ?".

"ఎందుకేటి బాబూ నాఖర్మ.... నాఖర్మ అలావుంది. నానుదుట అల్లా అట్లా రాసిపెట్టాడు— లేకపోతే నేనేటి దొంగతనం చేశానా. దురమార్గం చేశానా అళ్ళమ్మ అళ్ళ పెళ్ళాల్నెత్తుకొచ్చానా బాబూ.... నేనాళ్ళకేవ(పకారం చేసినానని, నంజికొడుకులు నాయింటికి నిప్పు ... బాబోయ్ నాయింటికి నిప్పెట్టేసినారు బాబోయ్...."

"ఆ నిప్పెట్టిందెవరు బాబూ"

"ఆళ్ళేబాబూ, ఆ కాకీచొక్కాలోళ్ల మిలిట్రీపోలీసు బాబూ, ఉక్కుటోపీలు ఆళ్ల నాయాళ్ల ఎద్దుల్లాగుంటరు. ఆళ్లమొకం నేనెరగనే.... నాయింటికి నిప్పెడ్డమేటి బాబూ.... యీలోకంలో నేనేదొరికిన్నా ? ఎవణ్ణనేటిది బాబూ నాకర్మమట్టాగుంటే" అంటూ నుదురు బాదుకోవడం మొదలెట్టాడు. అంతలోనే మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

ఎంత ప్రయత్నించినా మరి జవాబు చెప్పలేదతను. ఇదీగోల వీళ్ళతోటి. ఈమధ్య వరదలప్పుడూ అంతే విషయం చెప్పకుండా ఏడుపు. వీళ్ళకు చదువూ సంధ్యా, లోక జ్ఞానం లేకపోవడం కాదుగాని మాచావుకొస్తుంది, వీళ్ళను యింటర్వ్యూ చెయ్యాలంటే.

"చూడు బాబూ ఆలా నీవిలా బాధపడనక్కర్లేదు ప్రపంచం అంతా మీదుస్థితి చూసి పరితపిస్తోంది. తప్పకుండా మీరు మీయిళ్లకు తిరిగిచేరతారు. మీకష్టాలు కలకాలం వుండవు. మిమ్మల్నింత ఏడిపించిన కిరాతకులేనాటికి జయించరు ..." అంటూ కాస్త అనునయించ జూశాను.

నేను చెప్పిందేమీ అతనికర్థమైనట్లు కనిపించలేదు నాకు. కాని కళ్ళనీళ్లతుడుచు కుంటూ "యింకేటి కావాలిబాబూ మీకు" అన్నాడు

"మరేంలేదు. వాళ్ళు మీయిళ్ళెందుకు తగలెట్టారోనని?".

"నాకేటి తెలుసుబాబూ. మావూరు.... మా వూరంటే ఎంత. యీవూల్లో సగం కూడా వుండదు. ఓ రెండువంద లిళ్లుంటాయి గామోసు. ఆరోజు బాబూ యింటికాడ కూకున్న సాయంత్రం పూట. నాకొడుకింకా పొలంనుంచి రాలేదు. రెండు జీపుల్లో వచ్చిన్రు పోలీసోళ్లు నన్నూ మాసుట్టు పక్కలిళ్ళోళ్లని అందర్నీ లాక్కుపోయిన్రు ఊరిమధ్యలోకి. ఎవరో కుర్రోళ్లంట ప్రభుత్వంమీద పోట్లాడుతున్నరంట ఆళ్ళకాడ తుపాకులుగూడున్నయ్యంట బాబూ ఆళ్ల మీవూళ్ళవున్నరు సూపించండి అంటరు మాకేటి తెల్సు బాబూ. ఎర్రిముండోల్లం, తెల్దన్నం. ఒక్కొక్కణ్ణి పట్టుకు చావబాదిన్రి బాబూ, చావబాదిన్రు ఇదుగో యిటుసూడు బాబూ యీడ, యీ యెనక, యీవుమీద కనిపించిందా.... చర్మం లేసిపోయింది చూడు అదిబాబూ. ఆళ్లకర్ర, లాఠీకర్రంటుర్రి ... దాన్తో బాదినదెబ్బ అది, అంతేబాబూ— అందర్నీ, పెద్దోళ్ళని సిన్నోళ్లని అందర్ని బాదిన్రి ఎవరి కేటితెల్సుగనక ఏటిసెప్తరు బాబూ. కొట్టికొట్టి యిసుగేసుంటదో, వాళ్ల సేతులు నొచ్చినయ్యో బాబూ, అదిమువ్వు సూణ్లేదుగాని గోరంబాబూ పిల్లలు, ఆడోళ్ల గగ్గోలుగ కేకలేత్తుంటే పేణం గిలగిల్లాడిపోనాది బాబూ అంతా అయినాక నాలాంటోళ్ల నొదిలిన్రి. మా శ్యామ్‌లాల్, రమేశ్ భయ్యాల్లాంటోల్లని కాస్త వయసులోవున్నోళ్ల నేమో జీపుల్లో యెక్కించుకుపోయిన్రు బాబూ, అప్పటికి పీడావదిలిందిగదా అనుకున్నా బాబూ ...... ఆరాత్రేబాబూ, ఆరాత్రికి రాత్రి ... నాయింటికి నిప్పెట్టిన్రు బాబూ..., నాయిల్లు బాటోయ్ నేనేమవుతాన్రో దేవుడో.... ...."

కాస్త విషయం చెప్పాడుగదా అనుకుంటే మళ్ళీ ఏడుపులంకించుకున్నాడు. "ఇదేం ఖర్మరాబాబూ" అని నేననుకుంటుంటే హఠాత్తుగా మొదలెట్టాడు.

"నా కొడుకు బాబూ, నా కొడుకు— రెండ్రోజులు చూసిన్నా, గానీ ఆడార్రిలేదు బాబూ. నా కోడలు తనబ్బకాడికి తానుపోయింది నాకర్మమేంరా భగమంతుడా అని నేను తిరుగుతుంటే యీడ తిండి పెడుతున్నరని యవరో సెప్పిన్రు. యీడొచ్చి పడ్డాను బాబూ...."

1171

అతని కొడుకు ముక్తిఫౌజ్ మనిషన్నమాట. అదీ సంగతి. అదిచెప్పిచావడేం? నేనే అడిగాను "నీకొడుకింటి కెందుకురాలేదూ" అని

"ఏటొస్తడు బాబూ, మా శ్యామ్‌లాల్. రమేశ్‌లను పట్టుకుపోయినార్రి, ఆళ్ల సందర్నీ ఆ మర్నాడే– ఆ మర్నాడే "రంజిత్‌పూర్" లో కాల్చి చంపేసినుర్రి బాబూ. ఎవడి పాణంమీద తీపి ఆడిది. వూళ్ళో కుర్రోళ్లసందర్నీ పట్టుకుపోతరని అనుకుంటున్నారు. మావోడికీ అదేభయం".

"ఏమిటీ ఏవూరూ? రంజిత్‌పూరా?"

"అవును బాబూ రంజిత్‌పూరే. మొత్తం పదిహేను మందినంట బాబూ కాల్చి చంపినర్రిట".

"ఇంతకీ నీదేవూరు?"

"నాదా, నాది రాజానగర్ బాబూ"

తల తిరిగిపోయింది నాకు. రంజిత్‌పూర్, రాజానగర్ రెండూ భారతదేశంలో పశ్చిమ బెంగాల్లో జల్పాయిగురి జిల్లాలో గ్రామాలు.

"నీది బంగ్లాదేశ్ కాదా?" అని అడిగాను గాభరాగా.

"నాది రాజానగర్ బాబూ. శచీన్‌పూర్ తాలూకా".

టంగ్ టంగ్‌మని గంటకొట్టారు. ఆదరాబాదరాగా పరిగెత్తాడతను. అన్నంగిన్నెపట్టుకొని, పిలుస్తున్నా వినినించుకోకుండా.

అందరికీ భోజనం టైంకదా అని నేనూ హోటల్‌కి వచ్చేశాను. ఇంతకష్టపడి రాసుకున్న నోట్స్ ఏంచేయడమా అన్నది పెద్దబాధైపోయింది నాకు.

* * *

ఆ సమస్య కలకత్తా వచ్చేకకాని తెగలేదు. మా రతీన్ సలహాయిచ్చాడు. 'అంత మంచినోట్స్ పారేసేకన్నా, బంగ్లాదేశ్‌లో వూళ్ళపేర్లతో పంపిస్తే మంచి ఎస్సే తయారవుతుందని, బంగ్లాదేశ్‌కు చాలా సహాయంచేసి బెంగాలీగా నాబాధ్యత తీర్చుకోవచ్చునని'.

* *

ఆ సలహా ఫలితమే నేను ఆ ఎస్సే రాయడం. యీ ప్రశంసలూ. యీ పారితోషికమూ.

వెంటనే రతీన్‌కు రింగప్‌చేశాను. "ఈ రాత్రి. త్రీ ఏసెస్‌లోపార్టీ. విత్ ది గర్ల్ యూచూజ్.... ఓకె" అంటూ.

1172